# బేడ ట్రాజడీ

: రచన :
“జాస్మిన్”

సాయంకాలం అయిదుగంటలయేసరికి సబ్బుతో ముఖం తోమేడు కామేశ్వర్రావు. “ఏ రకం సబ్బుతో ముఖం తోమేడు” అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేం. ఆ సబ్బు ఎంతిచ్చి ఏషాపులో కొన్నాడో ఎవరికీ తెలియదు. సబ్బుమీద ముద్రించిన పేరు మొదట్లోనే చెరిగిపోయింది. అదింకా చెరగనప్పుడు ఎవరూ చూడలేదు. పోనీ వాసనబట్టి ఏరకమో పోల్చవచ్చును గదా, అంటే ఇంత స్వల్పవిషయాని కంత శ్రమ పడ్డం ఎందుకంటాను నేను. శ్రమపడి తెలుసుకుంటే మీకూ నాకూ వచ్చిందేమిటి? రాగా పోగా సబ్బుపేరు మనకి తెలియదు. ముఖం తోముకున్నది సబ్బుతో మాత్రమేనని మాత్రం మీకు నిశ్చయంగా చెప్పగలను. కామేశ్వర్రావు ముఖమైనా తోముకోకుండా ఉంటాడు, కాని కుంకుడుకాయలు, షీకాయి, పెసరపిండి ఇత్యాదులెన్నడూ ఉపయోగించడు. అవి ఉపయోగించడం అగౌరవమని కామేశ్వర్రావు అభిప్రాయం కాదు. సబ్బు వాడినంతమాత్రాన్న కీర్తి ప్రతిష్ఠా కూడా రావు. స్టూడెంట్సు సబ్బే వాడాలని ఎక్కడా రూలు లేకపోయినా అందరూ అదే వాడ్డంచేత కామేశ్వర్రావూ వాడుతున్నాడు. ఇందులో ఇంతకన్న విశేషం వేరేమీ లేదు.

కామేశ్వర్రావు మీకూ నాకూ తెలియని పేరుగల సబ్బుతో పదినిమిషాలు బాత్‌రూంలో నీరు ఖర్చుపెట్టి, ముఖం శుభ్రంచేసుకున్నాడు. తరువాత తైలసంస్కారానికి ముందుగా, జుత్తుకి జలసంస్కారంచేసి, తువ్వాలు తడిచేసి, ముఖం పొడిచేసుకొని బాత్‌రూమ్‌లోంచి బైటకిరాబోయేడు. పైన కాసుక్కూర్చున్న నలుగురు హాస్టల్‌మేట్సు జెబ్బల్తో తోసుకుంటూ అంతాఒక్కసారే బాత్‌రూమ్‌లో ప్రవేశించబోయేరు. వెండితెరమీద ఎరోల్‌ఫ్లిన్ శత్రువులదాడిని తప్పించుకున్నట్టు అతి చమత్కారంగా వాళ్ళని తప్పించుకొని బైటపడి తన గదిలోకి పోయేడు కామేశ్వర్రావు.

గదిలోకివెళ్ళి తువ్వాలు దండేనికి చేర్చి తన ముఖం అద్దం దగ్గరకి చేర్చేడు కామేశ్వర్రావు. నల్లటి ముఖం అద్దంలోంచి కొంత గర్వంతో నవ్వింది. నల్లగా ఉంటే నేం? అదొక పెద్ద తప్పా? నల్లగా ఉన్నా చాలా నున్నగా ఉన్నాది. హాస్టల్లో అంత నున్నటి ముఖా లెవరికున్నాయి? అద్దానికి ప్రక్కనే హాలీవుడ్ సినీమాతార చిత్రంగూడా నవ్వుతూంది కామేశ్వర్రావుని చూసి. (మీరు వెళ్తే మిమ్మల్నికూడా చూసి నవ్వుతుంది) చిత్రంలోవున్న తార ముఖంకూడా నున్నగానే ఉన్నాది. అద్దంలో కోసారీ, చిత్రం వైపు కోసారి చూసి “ఫరవాలేదు. బాగానే ఉన్నాను” అనుకున్నాడు. కాని ఆ తారకి తను తగుదునా, తగనా అని ఒక్క క్షణం ఆలోచించేడు. ఏమైనప్పటికీ ఆమె హాలీవుడ్ తార. “మనకి ఛాన్సు లేదు” మనవాళ్ళంత బావుండరు. మనవాళ్ళల్లో ఏ తారకైనా తను గుడ్‌మేచ్. ఈ నిశ్చయాభిప్రాయానికి వచ్చేక కామేశ్వర్రావుకి తలదువ్వుకోవలసిన అవసరం కన్పించింది. తన నూనె సీసాలో ఉన్న కొబ్బరినూనెవైపు చూసేడు. అయిపోవచ్చింది. మడ్డిగా ఉంది. రూమ్మేటింకా రాలేదు. రూమ్‌మేట్ హెయిరాయిల్ కొంత ఉపయోగించినట్లయితే అతనికి లాభమూ లేదు. తనకి నష్టమూలేదు. లేక అతనికి నష్టమూలేదు, తనకి లాభమూ లేదా; లేక అతనికి లాభంఉండి తనకి నష్టంలేదా; లేక తనకి లాభం ఉండి......ఏదో ఒకటనుకుని హెయిరాయిల్ తన కొలతప్రకారం అతి కొంచెం తీసుకొని, నల్లటి జుత్తుకి పట్టించేడు. (మధ్య మధ్య పలితకేశాలుంటే నేం, మొత్తంమీద నల్లటిజుత్తు).



అప్పటికి అయిదుగంటల్దాటి ఇరవై నిమిషాలయింది. ఆరున్నరకి ఆడపిల్లల బళ్ళో ఆడపిల్లలు డ్రామా వేస్తారు. (స్త్రీలకి మాత్రం) నటీమణులే కాకుండా, నటులుకూడా ఆడవాళ్ళే నట! ఆరుగంటలక్కాని ముస్తాబయి ఆడవాళ్లు బయల్దేరరు. వాళ్ళు వెళ్ళేదాల్లో పచారు ప్రారంభించడానికింకా నలభై నిమిషాల టైముంది. ఓ చచ్చినంత టైముంది.

కామేశ్వర్రావు నల్లటిజుత్తుని (మొత్తంమీద నల్లటి జుత్తుని) ముందుకి, పక్కకి, వెనక్కి, ఎగువకి, దిగువకి, దువ్వడం, సవిరించడం, నొక్కడం, లాగడంతో దువ్వెన జీవితంలో ఏడున్నర నిమిషాలు ఖర్చయింది.

స్నో (ఏ రకం స్నో అనే మీ చిలిపి ప్రశ్నకి నేను జవాబు చెప్పదలచుకోలేదు) స్వస్థానమైన సీసాలోంచి కామేశ్వర్రావు యొక్క నున్నటిమొఖంలో (నల్లగా ఉంటే నేం) ఉండే సూక్ష్మరంధ్రాలని కాపాడ్డానికి వాటిద్వారాల్లో ప్రవేశించింది.

**Snow is only the second line of defence.** అది ప్రాంతీయ సైన్యంలాంటిది. ఫ్రంట్ లైన్ కాపాడ్డానికి కావలసింది పౌడర్, ఫేస్ పౌడర్. అది కూడా తగుమాత్రం తీసి ముఖరక్షణకి నియోగించేడు కామేశ్వర్రావు.

తరువాత తలుపు మూసేడు బట్ట వేసుకుందికి. (ఆడవాళ్ళే కాకుండా మొగవాళ్ళుకూడా తలుపువేసుకొని వస్త్రధారణ చేస్తారనే థీరీని సపోర్ట్ చెయ్యడానికిదో ఉదాహరణ) కామేశ్వర్రావు దుస్తులు ధరిస్తూ ఉండగా ఆడవాళ్ళుకాని, మొగవాళ్ళుకాని ఎవరూ ఇంతవరకూ చూడలేదు. (అతని బాల్యంలో తప్పించి) ఈ విషయమై మీకూ నాకూ ఎవ్విధమైన విచారమూలేదు కాని కామేశ్వర్రావుకి మాత్రం చాలా విచారం. అంటే మొగవాళ్ళు చూడలేదనికాదు, ఆడవాళ్ళు చూడలేదని. ఆడవాళ్ళల్లో ఐనా వృద్ధులూ, బాలలూ చూడలేదన్న విచారంలే దతనికి. వయసులో ఉన్నవాళ్ళూ, అందులోనూ అందకత్తెలూ తనని చూడాలనే కోరిక అతనికున్నాది. చూడాలనే ఉబలాటం సుందర కాంతలకి ఎంతమాత్రం లేదని, ఉండకూడదనీ మనం అనుకోవచ్చు. ఇబ్బందేమీ లేదు. ఆఖరికి యువతీ వీక్షణాలు పడకుండానే కామేశ్వర్రావు బట్టలు వేసుకున్నాడు, వేసుకున్నాక యువతీమణుల దృష్టిపథంలో పడతాననే ఆశతో. (మంచి దుస్తుల్తో ఆడవాళ్ళని ఆకర్షించాలనే ఆశ మీకూ ఉన్నాది. కాని మీరు వప్పుకోరు. నాకులేదు అటువంటాశ. అలా అన్నా మీరు వప్పుకోరు).

ఆశల్తో కూడుకున్న కామేశ్వర్రావు వేషం వర్ణించాలా? తప్పదా? ఎందుకీ క్యూరియాసిటీ? వెక్కిరిద్దామనా? వెక్కిరించండి. అదే చేతనవును మీకు.

పాదరక్షలు (బూట్స్, షూస్, ఏవో) పాలిష్‌తో మెరుస్తున్నాయి. అన్నయ్యకి సరిపడకపోతే పుచ్చుకున్న ట్వీడ్ పెంట్లాం సన్నటి కాళ్ళని కప్పుతూంది. తెల్లటి షర్టు లోపలకి తొయ్యబడ్డాది. అందులోంచి నల్లటిముఖం (మాటిమాటికీ రంగుల ప్రస్తావనెందుకంటూరా? క్షమించండి. ఇహ నా సంగతి ఎత్తను) ఏసంగతో మర్చిపోయేను... ఆ! నల్లటిముఖం (క్షమించండి) పైకి లాగబడ్డాది.

పెంట్లాం జేబుల్లోకి చేతుల్తోసేడు.

కుడిజేబు ఖాళీగా ఉన్నాదని కుడిచెయ్యి మెదడుకి మెస్సేజ్ పంపింది. ఎడమజేబులో బేడకాసు ఓమూల దాగున్నాదని ఎడమచేతి వార్త. ఈ విషయం తెలుసుకుని నాసారంధ్రాలగుండా విడిచేడు కామేశ్వర్రావు. రెండురోజుల్లో మనియార్డరందేవరకూ కానీ లేదనుకున్న కథానాయకుడికి రెండణాలకేష్.

“ఇవాళకి చాల్ను” కామేశ్వర్రావనుకున్నాడు.

ఆరుగంటల అయిదునిమిషాలయింది అతనలా అనుకుంటున్నప్పుడు. ఆరుగంటల పదినిమిషాలకి ఆడపిల్లల బడికిపోయే రోడ్డుని కాళ్ళకింద తొక్కుతున్నాడు.

ఆరుగురాడవాళ్ళు అనతిదూరంలోనే ఉన్నారు. వాళ్ళల్లో ఇద్దరు ముసలివాళ్ళనీ, ఒకర్తె ఈడురానిపిల్లనీ, గమనించేడు కామేశ్వర్రావు. మిగతా ముగ్గుర్లోనూ ఎవరు బావున్నారో? చూద్దాం అనుకున్నాడు.

అయితే, నోట్లోనో, చేతిలోనో. సిగరెట్ లేకుండా ఆడదాని కంటిముందు నిల్చోడమెటుల? సిగరెట్ ఉంటేనే మొగవాడి ఠీవి. ఏనుక్కి అంబారీ వేసినట్టుంటుంది. తలపాగాకి తురాయి పెట్టినట్టుంటుంది.

అర్ధణా సిగరెట్, అర్ధణా కిల్లీ, అణా మిగులు. సిగరెట్ కొనడానికి, అంటించడానికీ, మహాఅయితే మూడునిమిషాలవుతుంది. మందగమనలకి వాకింగ్ రేస్‌లో మూడు నిమిషాల స్టార్ట్.

దుకాణం దగ్గర జేబులో చెయ్యిపెట్టేడు. పెట్టేలోపునే క్లాస్‌మేట్ రామారావు కలిసేడు.

కిల్లీ సిగరెట్, కొనబోయేటప్పుడు, జేబులో బేడకానే ఉన్నప్పుడు సిగరెట్ కాల్చే స్నేహితుడు కనిపించకూడదు. తీరాకనిపిస్తే సిగరెట్టు కొనడమైనా మానుకోవాలి; లేదా స్నేహితుడిక్కూడా ఇచ్చితీరాలి. స్త్రీలోకం కళ్ళముందు కదలిపోతూ ఉండగా స్మోక్ చెయ్యకుండా ఉండలేదు కామేశ్వరుడు. అందుచేత స్నేహితుడికి కూడా కిల్లీ, సిగరెట్ ఇచ్చుకోవాలి. మిగలవలసిన అణా మిగల్దనుకున్నాడు. రెప్పపాటుకాలం రామారావే సిగరెట్లు కొంటాడేమోనని చూసేడు. రామారావటువంటి ఉద్దేశం ఎన్నడూ, ఎవరికీ కనపర్చడు. ఇప్పుడుకూడా కనపర్చలేదు.

“రెండు సిగరెట్లూ, రెండుకిల్లీలూ ఇయ్యవోయ్” అన్నాడు కామేశ్వర్రావు.

దుకాణంలోంచి రెండు సిగరెట్లూ, కిల్లీలూ కామేశ్వర్రావు చేతిలో కొచ్చేయి. జేబులోంచి రెండణాలకాసు పైకి వచ్చింది. పైకొచ్చింది కాని దుకాణంలోకి వెళ్లలేదు. తియ్యడంలో విస్సాటంగా తీసేడో, తియ్యడం ఇష్టంలేక తేలిగ్గా తీసేడో తెలియదు కాని ఆ బేడకాసు కొట్టువాడి చేతిలోపడ్డానికి బదులు కిందనున్న మురుక్కాలవలోపడి మాయమయింది. కామేశ్వర్రావు చేతిలో సిగరెట్లూ, కిల్లీలూ రెండేసి చొప్పున ఉన్నాయి కాని రెండణాల కాసుమాత్రం కనపడలేదు.

కాతాపెట్టడానికిది కొత్త దుకాణం. అరువడిగినా ఇవ్వడు. ఇహ గత్యంతరం లేదు. మొహమాటపడి లాభంలేదు. రామారావుని అడగాల్సిందే.

“భాయీ రెండణాలుంటే ఇతనికిచ్చెయ్యవోయ్.”

రామారావు తలగోక్కుంటూ అన్నాడు.

“పర్సు తేవడం మర్చిపోయేను బ్రదర్. వెరీ సారీ.”

సిగరెట్లూ, కిల్లీలూ దుకాణంలోకి పోయేయి. కామేశ్వర్రావు, రామారావూ బైటకి పోయేరు.

మురుగుకాలవనీటికి రెండణాల విలువ హెచ్చింది కాని దుకాణదారుడి దృష్టిలో వెళ్ళిన స్టూడెంట్సుకే విలువా లేకపోయింది.

తరువాత దుకాణంవాడన్నాడు దగ్గరున్నవాళ్ళతో, “తంతే ఇద్దరిదగ్గరా కలిసి దమ్మిడీ లేదుగాని సూట్లు మాత్రం ఎలా బనాయించేరో చూడండీ” అని.

ఆవేళ స్త్రీలోకానికి (నోట్లోనో లేక చేతిలోనో) సిగరెట్టుతో ఉండే కామేశ్వర్రావు ఠీవీ, దర్జాచూసి సమ్మోహితులయే భాగ్యం లేకపోయింది.